కథా(క్రమం బెట్టిదనిన. . . .

అనగా అనగా ఓ అబ్బాయి అతడిపేరు గోపాలం. అతనికి బోలెడు ఆస్తి, అందమైన రాధ అనే పెళ్ళాం. విశాలమైన హాల్సుతోఉండే పెద్ద మండువా మేడ, ఓ కారు—వగైరా హీరోల కుండాల్సిన లక్షణాలు బోలెడున్నాయి. అయినా అతడే హీరో అని మీరు పనిగట్టేస్తే పొరబడ్డారన్నమాట. పెళ్ళయిపోయినవాడు హీరో ఎలా అవుతాడు ?

ఓ అందమైన సాయంకాలం యీ హీరో కావాల్సిన గోపాలం నిజం హీరోలాగ పోర్టికోలో కారాపుజేసి బూటుని మొజాయిక్ ఫ్లోరింగుమీద టకటకలాడిస్తూ లోపలకడుగుపెట్టి "రాధా !" అని వెర్రికేకొకటి వేశాడు.


"అబ్బ ! ఏమిటా పిచ్చికేకలు ! వస్తున్నాగా" అంటూనే రాధ ఆలస్యం చేసింది.

గోపాలానికి నిజంగానే పిచ్చెక్కినట్టయింది. తనంతటతను, రెండు గంటలసేపు ఊరంతా బలాదూర్ తిరిగి, అక్కడా యిక్కడా కుంకుడుకాయ పులుసులాంటి కాఫీ కప్పులు—కప్పులుకాదు, కప్పులో కాఫీ—రెండు మూడు లోపల పోసుకుని కష్టపడి యింటికి జేరితే, ఆదర్శ సతీమణి కావాల్సిన రాధ దరిజేరి, టై, బూట్ లేసులు వగైరావిప్పి, కాస్త కాఫీ, రెండు మూడు తియ్యటి కబుర్లు యివ్వడం చెప్పడంమాని—పైగా. . .

గోపాలం నీళ్ళు కారిపోయాడు. దార్లో అతనెంతో ఊహించుకున్నాడు. యింటికి వెళ్ళగానే రాధ తనకెలా ఎదలొచ్చేదీ, తన తెలివితేటల్నెలా అభినందించేదీ, అంతా. . . . తనకి రోజారంగు సిల్కుచీర అంటే యిష్టమని రాధకి బాగా తెలుసు. అది కట్టుకుంటే రాధ ఎలాగో ఉంటుందంటాడు గోపాలం—ఎలా ఉంటుందన్నదీ సరీగ్గా గుర్తుపట్టలేక తన దగ్గిర సావచ్చిన మల్లెపువ్వులాంటి రాధ చామనచాయ చెక్కిళ్ళమీద రెండు అరచేతులూ బలంగా ఆనించి . . . అప్పుడు రాధ కళ్ళు మూసుకుంటాయి, వెంటనే క్షణంసేపు మెరుస్తాయి. మళ్ళా మూసుకుంటాయి . . .

ఇంతా ఆలోచించుకుని హడావిడిగా లోపలి కడుగుబెట్టిన గోపాలానికి నిరాశే మిగిలింది రాధ పావుగంటపోయాక రేగిన జుట్టుతో, మసి చేతులతో




న కథ
ంతరావు

కాటుక జారిన నల్లటి చెక్కిళ్ళతో, పొగమారి తడయిన కళ్ళతో లోపల కడుగుబెట్టింది.

నీళ్ళుగారిన గోపాలం గడ్డకట్టిపోయాడు.

"ఏమిటావేషం ?"

"నా వేషానికేమొచ్చిందిగాని, యెందుకంత అల్లరి చేస్తారు ?"

"ఇన్నల్లు ! అల్లరేమిటి ? నేనేం పసిపిల్లాడి ననుకున్నావా !"

"పసివాళ్లే వయం మీకన్నా. . . .ఏమిటా దిష్టిపిడత చేతిలో !"

"మైగాడ్ ! దిష్టిపిడతా యిది ! . . . . . అర్జంటుగా డాక్టర్ని పిలవాలి, నీ కళ్ళు టెస్ట్ చేసేందుకు"

"ఏమిటది కాకపోతే ! కుండలాగ దాని ఆకారం, ముదురు రంగుల్లో తోడేళ్ళు, పాములు, నక్కలు, కప్పలు . ఏమిటది ?" నవ్వునాపుకుంటూ అంది రాధ

"అలా అడుగు చెబుతాను. మన టేబిల్‌మీదికి పూలు పెట్టుకునేందుకు వేస్ ఒకటి తెమ్మని నువ్వు కదూ అన్నావు నిన్న రిమైండరు కూడా యిచ్చావు. సరే, యివాళ కొనేశాం! యిందాకా అలా అబిడ్స్‌లో పోతూంటే అక్కడ షోకేస్‌లోంచి బయటికి కనబడింది. వెంటనే వెళ్ళి తెచ్చేశాను."

"నా మొహంలావుంది !"

"థాంక్యూ"

"నా మొహంలాఉందంటే బాగుందనికాదు నే చెప్పేది !"

"అసలు నీ అభిప్రాయం అడిగిందెవరు ! ఆడవాళ్ళ సలహా విని బాగుపడిన వాడెవ్వడూలేడు"

"అలా అనుకొని వూరుకుంటే రక్షించిన వారవుతారు" రాధ వెనక్కి తిరిగి గుమ్మంవేపు నడిచింది

"యిదుగో, అంతకోపం అయితే ఎలా చెప్పు . యిది బాగుండలేదంటావు. అంతేనా ! దీన్ని నే కొంటున్నప్పుడే చూసిన ఓ గిరిజాలజుట్టు, ఆర్టిస్టుమార్కు పెద్ద మనిషోహాయన ఉహూ మెచ్చుకుని దీని ఆర్ట్‌ని తెగ పొగిడాడు. పైగా సాలార్‌జంగ్ కనక దీన్ని చూస్తే వెంటనే ఏ పదో లక్షో రూపాయలు కొట్టువాడి మొహాన పడేసి తీసికెళ్ళి మ్యూజియం గాజుబీరువాలో పెట్టేసి అర్థ రూపాయి యిస్తేనేగాని చూపెట్టేవాడు గాదన్నాడు ! 'ఆర్టం'టే నీకేం తెలుసు ! కనీసం 'స్పెల్లింగ్గైనా' తెలుసూ !"

"మీరిహ్నాక్లే అలా జోకుమీద జోకు వేసేయకండి ఈ కథరాసే హనుమంతరావు పాపం బరువుగా రాయాలని కూచున్నాడు ! మీ రలా తేలిగ్గా మాట్లాడేస్తే ఎలా !"

"ఇదుగో అమ్మాయ్. నువ్వలా టక్కరి వేషాలు వేస్తే లాభంలేదు ఈ అందమైన వేస్‌ని శుభ్రంగా తుడిచి టేబిల్‌పైనుంచి రోజూ ప్రొద్దున్నా, సాయంకాలం తాజాపూలతో నింపాల్సిందే. లేకపోతే ఊరుకునేదిలేదు నీ యిష్టమంతా రాగి బిందెలు, తాచిప్పలు వగైరా కొనడంలో—ఆ ఫీల్డు నీది. యిలాంటి కళకి సంబంధించిన విషయాల్లో గాదు"

"నా బాధంతా అది రాచిప్పలాగుందనే !"

"వెనకెవడో భర్తృహరో, షేక్స్పియరో అన్నాడు రాయినుంచి నూనె అయినా తియ్యొచ్చు గాని. . . .అలా ఉంది నీ ధోరణి ! . . . సరే, నాకోసం ఎవరన్నావస్తే 'అమావాస్య' పత్రిక ఆఫీసులో ఉంటానని చెప్పు గోపాలం విసురుగా బయటి కెళ్ళిపొయ్యాడు.

గోపాలానికి రాధమీద కోపం వచ్చినప్పుడల్లా శేఖరం జ్ఞాపకం వస్తాడు శేఖరం రాధకొక అర మైలు దూరంలో అన్నయ్య అవుతాడు 'అమావాస్య' పత్రిక్కి ఎడిటరు రాధ అమాయకత్వాన్ని తెలివి తక్కువతనాన్ని, అవివేకాన్ని యింకా యిలాటి ఎన్నిట్నో శేఖరంముందు ఏకరువుపెట్టి, అలాంటి దాంతో తను గాబట్టి ఎలా నెగ్గుకొస్తుందీ వివరించి, బోలెడు సానుభూతి పొందడం గోపాలం వాంఛితం.

ఒకడు (మరొకడితో) :– వాల్మీకి రాసిన రామాయణం ఎంత మధురంగా ఉంటుందను కొన్నావ్!

మరొకడు :– నిజంగా చాలా బాగుంటుంది.

ఒకడు :– నువ్వు చదివావా?

మరొకడు :– లేదు! నువ్వో?

ఒకడు :– నేనూ చదవలేదు.

వి. వి. రమణారావు (విశాఖపట్నం)

కాని ఆరోజు శేఖరం మూడ్స్‌లోలేడు. నిజాని కెప్పుడూ ఉండడు అసలీ "రచకగాళ్ళ"ంతా యింతే ఎప్పుడూ బరువుగా ఉంటారు. అయితే శేఖరం ప్రతిరోజుటికన్నా మరీ పేట్రేగిపోయి, యింకా మూడ్సులో లేకుండా పోయాడు. ఆతగాడ్ని చూసేసరికి గోపాలం యింకా క్రుంగిపోయాడు. చాలా సానుభూతి కలిగింది. ఓదార్చాలనిపించింది.

"ఏమోయ్, శేఖరం మొన్న మీ ప్రత్యేక సంచిక బ్రహ్మాండంగా ఉందోయ్ !"

"నిజంగానా !" శేఖరం ఉలిక్కిపడి కూర్చుని ముందుకు వంగాడు

సుపర్బ్అనుకో !"

"అందులో "ఏకాంతం" అనే గేయం ఎలా ఉంది బావా !"

"ఎలా ఉండడమేమిటి ! అది లేకపోతే అసలా పత్రికేలేదు ! చాలా బావుంది ఎవ్రాశారోయ్ !"

"ఆక్రింద రాసేఉందిగా !" నీరసపడిపోయాడు శేఖరం.

గోపాలానికి తనా పత్రిక నసలు మాట వరసకైనా చూడకపోయినందుకు చాలా విచారమేసింది. అయినా గుండె రాయి చేసుకుని అన్నాడు

"చదివేవుంటాను సరిగ్గా గుర్తులేదు ఏమిటో కళని కళకోసం ఆరాధిస్తాన్నేను అది చేసిందెవడు, యిది రాసిందెవరూ అని పట్టించుకోను" గోపాలం పెద్ద వేదాంతిలాగ మాటాడేశాడు

"అది రాసిందొక మహా మేధావి, అప్సరస, జీనియస్ . . . ప్రేమలత !"

గోపాలానికి యింకేరకం తెలివి తేటలున్నా లేకపోయినా, ప్రేమగుండాల్లోపడ్డవాళ్ళని యిట్టే పసిగట్టేయగల నేర్పుంది లోతుకళ్ళు, దూరం చూపు, తడబడే మాటలు, సగం గొణుగుడు, పరధ్యానం, మాసినగడ్డం, నలిగిన బట్టలు వగైరా లక్షణాలన్నీ అతనిట్టే పట్టేస్తాడు

"అంత బాగుంటుందేమోయ్, ప్రేమలత !"

"నువ్వలా నెమ్మదిగా అడుగుతున్నావంటే ఆమె అందానికి తీరని అపచారం చేస్తున్నావన్న మాట ! ఆమె ఆకాశపు టెత్తుల్లో విహరించే దేవకన్య ! నేనో. . పాతాళపు లోతుల్లో కుములుతూంటాను! ఆమె చలువలు విరిసే చంద్రికా డోలల్లో ఊగుతూంటుంది. నేను సముద్రపొడ్డు రాతి గుట్టలపైని పొగులుతూంటాను ఆమె తూర్పు దిక్కున ఆకాశంమీద కుంకుమ పంకం పులుముతూంటుంది. నేను పడమటి సముద్రంలో పగిలిన పడవమీద పయనించాలని ప్రయత్నిస్తాను ! ఎంతతేడా ! ఎంత వ్యత్యాసం ! ఆమె ఎక్కడ! నే నెక్కడ !"

గోపాలానికీ భాష అర్థం గాలేదు అర్థమయిందల్లా యీ శేఖరం అనే అభివృద్ధిలోకి రావాల్సిన అబ్బాయి, ఆ ప్రేమలత అనే ముక్కూ మొగం తెలియని అమ్మాయిని దారుణంగా ప్రేమిస్తున్నాడు. ఊరికే ప్రేమించి ఊరుకుంటే బాగుణ్ను. ఆమె తనకందని ఎత్తుల్లో అంతరిక్షయానం చేస్తోన్నట్టూహించుకుని నిరాశపడిపోయి, వ్యథపడిపోతున్నాడు. యిలా పడిపోవడం యింకా కొనసాగితే తనలో తనకే నమ్మకంపోయి, తన బ్రతుకు వ్యర్థమనిపించి . . . . . గోపాలానికాతర్వాతమెట్టును గురించి తల్చుకుంటే ఒళ్ళు జలదరించింది. భయం పట్టుకుంది

"అయితే శేఖరం ! నువ్వామ్మాయితో కచాపచీ మాట్లాడేసి తాడో పేడో తేల్చేసుకోగూడదూ!"

"ఆమెతో అసలు ఎలా మాట్లాడను బావా ! ఆమెను చూడగానే ఆమె ఔన్నత్యంతలపు రాగానే, నా అల్పత్వం చటుక్కున గుర్తొస్తుంది. అంతే చెప్పలేని విస్ప్రహ నన్నావరిస్తుంది."

"చాలా విషమ సమస్యే !"

ఇంతలో ఓ పెద్ద ఆకారం లోపలికి అడుగుపెట్టింది. నేల అదిరేలా అడుగులు వేసుకుంటూ, దాన్ని చూడగానే శేఖరం—తేలిగ్గా కుర్చీలో వాలి మాట్లాడుతున్నవాడల్లా—ఒక్కసారి గెంతి 'అటెన్షన్'లో నిలబడ్డాడు. నిలబడి అతి వినయంగా నమస్కరించాడు.

ఆ వచ్చినాయన ఠంగారుగా, తేలిగ్గా చేయెత్తి దించేసి "ఇదుగో శేఖరం, యింకో వ్యాసం రాసు

కొచ్చాను. ఆస్ట్రేలియాలో గొర్రెల పెంపకం గురించి వేసుకుంటావుగదూ !''

''యస్సార్ !'' శేఖరం అష్ట వంకరలు తిరిగి పోయాడు నెమ్మదిగా ప్రక్కకి జరిగి తన కుర్చీలో ఆయన్ని కూర్చోబెట్టాడు.

''క్రిందటివారం నా వ్యాసం అలా మూలగా ఎక్కడో కుదించి పారేశావు ! యీసారయినా మరి కాస్త ప్రాముఖ్యాన్నిస్తావని ఆశిస్తాను . అహా! ఏమనుకోకు—యిదంతా నీ యిష్టా యిష్టాలకి పూర్తిగా వదిలేయాలనుకో అయినా మనకున్న పాత పరిచయాన్ని పురస్కరించుకుని .. ఏదో '' నమిలాడు ఆ వచ్చిన పెద్ద మనిషి

''యస్సార్ !''

''యింకేమున్నాయి సంగతులు ! ఏమీ లేవు నీ టైం పాడుచేయడం నాకిష్టంలేదు వెళ్లొస్తా'' పెద్ద ఆకారం నెమ్మదిగా బయటికి నడిచింది, ఆరూ బై నాలుగు బై రెండు అడుగుల మేర ఖాళీ చేస్తూ

గోపాలం స్టంట్ సినిమా చూస్తున్నవాడిలా నిశ్చేష్టుడై కూర్చుండిపోయాడు యింతసేపూ. శేఖరం వదిలిన ''హమ్మ్ !'' అన్న పొడుగాటి మూల్గు విన్నాక యీ లోకంలోకి పడ్డాడు

''ఎవరోయి యీ భూతం !''

''నా పాలిటి యముడు ! మా హైస్కూలు హెడ్మాస్టరు !''

''ఏం కథ !''

''కథేంలేదు. ప్రతివారం, కాంగోలో ఏనుగుల కుస్తీ గురించి, ఆస్ట్రేలియా గొర్రెల పెంపకం గురించి, హవాయి గొడ్ల రోగాలగురించి వ్యాసాలు రాసుకొస్తాడు ఇప్పటి కప్పుడే మా పబ్లిషరు రెండుసార్లు వార్నింగ్ ఇచ్చాడు ఈ 'అమావాస్య' పత్రిక కేవలం కాలక్షేపానిక్కావల్సినవి యివ్వడానికి ఉద్దేశింపబడింది దీంట్లో యీ చెత్తంతా రాస్తే.. యింకోసారి అది నేను ప్రచురిస్తే తన్ని తగిలేస్తాడు ''

''నాన్సెన్సు ! బయటికి పొమ్మని చెప్పెయ్య లేకపోయావా ?''

''ఎలా చెప్పను ! ఫిఫ్తుఫారం చదువుతున్నప్పుడు, ఏప్రిల్ ఒకటో తారీఖున ఎవడిమీదో సిరా విదిపానని నడ్డిమీద చంపేశాడు పేంబెత్తంతో ఆనాటినుంచీ ఆయన్ని చూసేసరికల్లా అవి గుర్తుకొస్తాయి. అంతే ఇంకేం మాట్లాడలేను అంతక్రితందాకా చెబ్దామనుకున్నదేదీ నోటంట బయటికిరాదు యిలా కుంచించుకు పోతాను'' శేఖరం తన గోడంతా వెళ్ళబోసుకున్నాడు

గోపాలం చాలా చాలా బరువెక్కిపోయాడు ఈ సమస్య చాలా గడ్డుదే యింతకుముందు ఎన్నిట్లో తనూ, రాధా కలిసి విడివిడిగానూ, సంయుక్తంగానూ, ఎన్నో సమస్యల్ని పరిష్కరించారు వాటన్నిటికన్నా గడ్డుతరమైందనిపించిందిది

బరువుగా కారు నడుపుకుంటూ యింటికి చేరాడు.

''ఇలా మాట్లాడినట్టే మాట్లాడి యింతసేపు మాయమైపోయారేం !'' రాధ నవ్వుతూఉంది. రాధ యిప్పుడు తనింతకుముందూహించినట్టు తయారయిఉంది అయితే గోపాలం మనసంతా యిపుడాలోచనల్తో బరువెక్కి రాధ అందాన్ని ఆస్వాదించగల పరిస్థితిలోలేడు

తిన్నగా డ్రాయింగ్ రూంలోకి నడిచాడు స్టాండ్‌పైన తను తెచ్చిన పూలకుండీనిండా రకరకాల, రంగు రంగుల పూలు అందంగా అమర్చబడి ఉన్నాయి అమాంతం గోపాలం హృదయం ద్రవించింది, రాధ మంచితనాన్ని తల్చుకుని

''రాధే !'' అని సంస్కృతంలో పిలిచాడు గోపాలం ఆనందం, జాలి, మంచితనం, అభిమానం, ప్రేమ వగైరా రసాలన్నీ కలిసిపోయిన అనుభూతిలో అల్లాపిలుస్తాడు రాధని రాధ అమాయికంగా చూస్తూ, నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వచ్చి సోఫాలో అతనికి పక్కగా కూర్చుంది అలాంటి పరిస్థితుల్లో రాధకి ముట్టాల్సినవన్నీ ముట్టజెప్పి నెమ్మదిగా అన్నాడు గోపాలం

''శేఖరం గట్టి చిక్కులో ఉన్నాడు రాధా ! వాడ్ని మనం ఎలాగో కాపాడాలి !''

''ఏమిటీటా గట్టి చిక్కు ?''

''జాగ్రత్తగా విను. . . నవ్వుతున్నప్పుడు అందంగా ఉంటావని ఒప్పేసుకున్నాంకాని అలా నవ్వకు . శేఖరం ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాడు కాని



ఆ సంగతి ఆమెతో చెప్పడానికి జడుస్తున్నాడు కారణం ఆమె చాలా గొప్పదనీ, తను చాలా హీనుడనీ అనుకోడం అదలా నీ చిన్నిబుర్రలో ఓమూల ఉంచు శేఖరం హెడ్మాస్టరు ఒకడు మరీ దుష్టుడయిపోయి, శేఖరం నడిపే పత్రిక కెంతమాత్రం శ్రేయస్కరంగాని కథలు వగైరా చెత్తనెంతో బుట్టలుకొద్దీ అతని నెత్తిన కుమ్మరిస్తున్నాడు, వేసుకుంటావా మానతావా అని ఇది మాకు పనికిరాదు అని చెప్పలేకపోతున్నాడు శేఖరం కారణం శేఖరం చిన్నప్పుడు యీ భయంకరాచారి శేఖరానికి వడ్డించిన నాలుగు దెబ్బలు ! యిప్పుడర్థమైందా పరిస్థితి ! యింక నీ బుర్రకి పని చెప్పు . . ''

రాధ మంచి పిల్లలాగా అంతావిని, ''నాకేం తట్టటంలేదు పోనిద్దురూ !'' అంది

''అలా అంటే ఎలాగ ! మీ అన్నయ్య కుద్యోగం పోతుంది పెళ్ళికాదు ! పిచ్చాడైపోతాడు ఏమో ఆత్మహత్య కూడా చేసుకోవచ్చు ''

''ఛా ఏమిటా మాటలు''

''అవును ఎన్ని జరగటం లేదలాంటివి ! అందుకే జాగ్రత్తగా ఆలోచించు. నీ ఒక్కగానొక్క దూరపు అన్నయ్యని బ్రతికించుకో ఈ లోపల నేనూ ఆలోచిస్తూంటాలే ''

ఆ మర్నాడుదయం లేవడంతోనే తాగుతున్న కాఫీ కప్పులోంచి పైకి లేస్తున్న పొగల మధ్యకి ఆదోలా చూస్తూంటే తటాలున గోపాలానికో ఆయిడియా తట్టింది వెంటనే రాధని పిలిచాడు. రాధ వచ్చింది.

''నిన్న రాత్రి నీతో చెప్పానుగదూ, ఆలోచించమని అక్కర్లేదులే నాకే వచ్చేసింది ఐడియా. యింక నువ్వదంతా మర్చిపో ''

''ఏమిట్ట''

''ఇలాంటి విషయాల్లో మన మొకదాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి ఏమిటది ?''

''ఏమో గుర్తులేదు ''

''గుర్తులేకపోవడమేమిటి ! నువ్వేగా మాట్లాడితే దాని పేరెత్తుతూంటావు !''

''సైకాలజీయా !''

''కరెక్ట్ ! మనస్తత్వం బాగా పరిశోధించాలి ఇప్పుడు శేఖరం చాలా అల్పుడనని అనుకుంటున్నాడు, ఏవో కొన్ని కారణా లూహించుకుని. యిలాంటివాడు కొంచెం గొప్పవాడనుకునేట్లు చేశామనుకో. అసలనుకో మొదట దాంతో ఒక్క ప్రేమలతనిగాదు, కోటిమంది, లక్షమంది ప్రేమలతల్ని క్యూలో పెళ్లాడేస్తాడు వెయ్యిమంది భయంకరాచారుల్ని నిల్చున్నపళంగా బయటికి గెంటుతాడు ''

''పోయింటే ''

''ఒప్పుకున్నావా ! గాబట్టి యిప్పుడు మనం చెయ్యాల్సినది శేఖరంచేత గొప్ప వాడయినట్టు ఫీలవ జేయడం అదెలాసాధ్యం ! దీనికి నేనో ప్లాను వేశాను. ఒక మనిషిని, నన్నే అనుకో, తలనిండా చొక్కాలాగులనిండా వంటాముదం పట్టించుకుని చూశావనుకో ! అప్పుడేమనుకుంటావు !''

''వంటాముదమా!''రాధ నవ్వునాపుకోలేకపోతోంది

''అవును. ఒకటోరకం బంకాముదంలో స్నానం చేసి నేను బయటికొస్తే నన్ను చూసి చీదరించుకోవూ ! యిప్పుడు భయంకరాచారే ఆ పని చేశాడనుకో. ఆ పరిస్థితుల్లో శేఖరం చూశాడనుకో ! వీడెవడ్రా వట్టి గినియాపిగ్ అనుకుంటాడు వీడ్ని చూశా, మన మింత భయపడ్డం అనుకుంటాడు ! నవ్వుకుంటాడు. యింకేముంది ! వెంటనే తన్ని అవతలికి పొమ్మంటాడు. దెబ్బతో వెయ్యేనుగుల బలం వస్తుంది. వెంటనే ప్రేమలతతో వెళ్ళి మాట్లాడేస్తాడు అంతా అయిపోతుంది. కథ కంచికి''

''ఇంతకీ వంటాముదంలో మునిగి అలాగే బయటికి శేఖరం దగ్గిరకి రావడానికి ఆ భయంకరాచారికే దెయ్యమున్నా పట్టేస్తారేమండీ !''

''అదంతా నా కొదిలెయ్ భయంకరాచారి అలా కనుబడేట్టుచేసే పూచీ నాది యిప్పుడు చెప్పు ఎలా ఉంది ఆలోచన !''

''ఏడిసినట్టుంది అస లిటు నరుక్కు రావాలి. ఎలాగోలాగ ప్రేమలత శేఖరాన్ని పెళ్ళాడేట్టుచేస్తే, వెంటనే భయంకరాచారి సంగతి వాడే తేల్చుకుంటాడు ''

''అదెలా సాధ్యమంటావు !'' కసిగా ఉక్రోషంగా అడిగాడు గోపాలం

''ప్రేమలత రాసిన ఏకాంతాన్ని, అంతకుముందు రాసిన కథల్నిబట్టి చూస్తే. . . . . .''

''నువ్వు చదివావేమిటి వాటిని ?''

''ఆఁ. ఆమెది చాలా సున్నిత హృదయం.






మీకు ఉచితం

"ప్లాన్డ్ ఫేమిలీస్". భర్తలు, భార్యలు నూతన వధూవరులు, అందరూ చదివి తీరవలసిన చిన్ని పుస్తకము. అప్పుడు మీరు మీ కుటుంబమును కావలసిన పరిమాణమునకు రూఢిగా నియంత్రణ చేసుకో వచ్చును. ఈ పుస్తకము "అనేక కఠిన ప్రశ్నలకు" సమాధానముల నిచ్చును మరియు కుటుంబ నియంత్రణ మీకు వంపద్కారంగా ఎట్లు సహకరింపగలదో స్పష్టంగాను, ప్రామాణికంగాను మీకు తెలుపును.

ఈ చిన్ని పుస్తకమును మీరు నిర్లక్షింపగూడదు




నేడే ఈ కూపన్ను పోస్టుద్వారా

ఎల్.బి. సీమోర్ అండ్ కొ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్., డిపార్టుమెంటు M-9 వల్కన్ ఇన్సూరెన్స్ బిల్డింగ్, చర్చి ., బొంబాయి – 1 "డ్యూరెక్స్" అండ్ "డ్యూరఫక్" కాంట్రాసెప్టివ్‌లకు ఏజెంట్లు: "ప్లాన్డ్ ఫేమిలీస్" అను పుస్తకము ఒక ప్రతి ఉచితంగా సాదా కవరులో దయచేసి నాకు పంపండి నేను వ్యక్తుడను

పేరు.. .. . ... . . ... .. ...

చిరునామా . ... . .. . . ....

Aiyars LDS/2TL


# బరువైన కథ

చాలా స్వల్పమైన విషయాలు ఆమె నమితంగా కదిల్చివేస్తాయి కాబట్టి శేఖరాన్ని ఏ చావుమంచం మీదనో ఉండగా చూసిందనుకోండి అతగాడు మగత నిద్రలో ఆమెపేరే స్మరిస్తూ, కడసారి ఊపిరి తీస్తూంటాడనుకోండి ఆమె చలించి పోతుంది ఆమె హృదయం కరిగి సెలయేరై పారుతుంది అతనికి కన్నీటితో సేవ జేస్తుంది రాత్రిళ్లు, పగళ్లు చివరికి అతగాడి స్వంత ఆస్తి ఐ పో తు ం ది సంతోషంగా వెంటనే పది ఏనుగుల బలం పుంజుకొని శేఖరం భయంకరాచారిమీదకి విజృంభిస్తాడు . ఆడ దాని మనస్సుని సులభంగా ఆకర్షించాలంటే అంతు లేని బాధాలహరిలో లోతుగా యిరుక్కుపోవాలి— కనీసం అలా కనబడాలి"

"రెండుసార్లు ఏడిసినట్టుంది నీ ఆలోచన ఈ ప్రేమలతకోసం పండులాంటి శేఖరాన్ని చావుమంచ మెక్కించాలంటావు. లేదా అప్పటిదాకా అతగాడ్ని యిలా మోడులా బ్రహ్మచర్యం వహించమంటావు !"

"అప్పటెప్పటిదాకా యెందుకు ! రేపో ఎల్లుండో ఏ కారుక్రిందో, లారీక్రిందో అధమం ఆటోరిక్షా కిందో పడ్డాడనుకోండి

"ఇదింకా ఏడిసినట్టుంది ! వాడు కారుక్రిం దెప్పుడు పడతాడా అని కాచుక్కూర్చుని ఆ తర్వాత ఆమెకి కబురు చెయ్యమంటావు నీ తెలివికి సంతోషించాంలేగాని . .నీ బుర్ర నెమ్మకుంది బయట వానలకి . . సాయంకాలంలోగా వెంకులుచేత ఓ వీసె వంటాముదం తెప్పించు నీవంట పనేదో నువ్వు చూసుకో"

గోపాలం రాథ అజ్ఞానాన్ని యిన్నాళ్టికి నేర్పుగా ఖండించెయ్యగల్గిన సంతృప్తితో హాయిగా రెండు సిగరెట్లు కాల్చి తన ఆలోచనకి రూపురేఖలు యింకా స్పష్టంగా దిద్దుకోసాగాడు

ఆ సాయంకాలం మూడు గంటలప్పుడు గోపాలం వీసెడు వంటాముదాన్ని కారులో పెట్టుకుని శేఖరం ఆఫీసుకి బయల్దేరాడు ఇక్కడ శేఖరం ఆఫీసు గురించిన వివరాలు కొద్దిగా చెప్పాలి రోడ్డు మలుపుదాటాక ఎడంచేతివైపు నాలుగో మేడలో పై అంతస్థుమీద అతని ఆఫీసు గుమ్మానికెదురుగ్గా సావిట్లో అవతలిమూల మెట్లు కనబడతాయి ఆమెట్ల వెంబడి పైకిపోతే ఓ సన్నటి వరండా వస్తుంది. దాని కానుకుని రెండుగదు లున్నాయి మొదటి గదిలోకి వెళ్లే తలుపు ఎప్పుడో గాని తెరిచి ఉండదు. శేఖరం మాత్రం ఆ గదికి ప్రత్యేకం తాళం వేసుకుని, తన రాక పోకలు అందులోంచే కొనసాగిస్తూంటాడు. రెండోగదిలోంచే గోపాలం, భయంకరాచారి వగైరా అతిథులొస్తుంటారు. యీ రెండో గదిలోంచి మొదటి గదిలోకున్న తలుపుమీదనే గోపాలం ఆముదంగిన్నె బాలన్సు చేసి అట్టే పెడ్దామనుకున్నది అలా బాలెన్సు అయిఉన్న గిన్నె కాస్త భయంకరాచారి రాగానే అతడి పెద్ద శరీరం తలుపుకి రాసుకోగానే భోరగిలబడుతుంది అతగాడి నెత్తిన. దాంతో యింకేముంది !. . .

అయితే యిలాంటి ఘాతుకకృత్యం నలుగురూ చూస్తుండగా గోపాలమంతటి పెద్ద మనుష్యులు చేయాల్సిందిగాదు గోపాలం చిన్నప్పు డెప్పుడో వాళ్ళ ప్రైవేటు మాస్టారిమీద యీ ట్రిక్ అద్భుతంగా ప్రయోగించి సాటిలేని అనుభవం గడించాడు ఇన్నాళ్ళయాక తిరిగి చేస్తున్నా యిట్టే చేసెయ్య గలిగాడు అక్కడున్న వాచ్‌మన్‌కి యింటి దగ్గిర తల్లికి అకస్మాత్తుగా ప్రాణం మీదికి వచ్చిందని తెలియజేసి, తను వెళ్ళిపోయిన సంగతి శేఖరానికిచెప్పి సెలవు మంజూరు చేయిస్తానని భరోసాయిచ్చి మరీ తన పనికి పూనుకున్నాడు గోపాలం.

మూడూ పది హేనుకల్లా అంతా రెడీఅయిపోయింది యింకో అయిదు నిమిషాల్లో శేఖరం వస్తాడు ముందు ద్వారంలోంచి తన గదిలోకివెళ్ళి కూర్చుంటాడు. ఆ తర్వాత భయంకరాచారి వస్తాడు. వచ్చి రాగానే ఆముదం నెత్తినిండా పడ్తుంది. క్రాష్ ! అంతే !

గోపాలం పట్టలేని ఆనందంతో గబ గబ మెట్లుదిగి రోడ్డుమీద పచార్లు చెయ్యసాగారు. కాసేపు చేతులు వెనక్కి కట్టుకుని, కాసేపు ముందు కట్టుకుని ఆపుకోలేని ఆత్రంతో, ఉత్సాహంతో గోళ్ళు కొరుక్కుంటూ పచార్లు చేశాడు ఇంతలో ముందుగా భయంకరాచారే సందుమలుపు తిరిగాడు భయంకరాచారిని చూడగానే విపరీతమైన జాలి పుట్టుకొచ్చింది గోపాలానికి నెమ్మదిగా మెట్లెక్కుతున్న ముసలాయనవంక చూసి జాలిగా నవ్వుకున్నాడు ఒకటి, రెండు, మూడు— అయిపోయింది ఈపాటికంతా అయిపోయింది. ఏం జరిగిందీ తెలియక ఆముదంలోపడి కొట్టుకుంటాడు పాపం! యీ క్షణంలో శేఖరం వస్తే బాగణ్ను !

గోపాలం మనస్సు డిటెక్టివ్ పుస్తకం చదువుతోన్నట్టుంది అరగంట సస్పెన్సులో గడిచిపోయింది. శేఖరం రాలేదు భయంకరాచారి ఏం చేస్తుంటాడో చూడాలని కుతూహలమయిందతనికి.

నెమ్మదిగా పై కడుగులు వేశాడు గోపాలం. శేఖరం ఆఫీసు మొదటి తలుపు తెరిచిఉంది గోపాలానికి కొద్దిగా నిరుత్సాహం కలిగింది. గబగబా లోపలి కడుగుపెట్టాడు అక్కడ చూసిన దృశ్యానికి నిర్ఘాంతపోయాడు గోపాలం

భయంకరాచారి తాపీగా కుర్చీలో కూర్చొని పేపరు చదువుతున్నాడు కొద్దిగా దగ్గాడు గోపాలం. తన ఉనికిని అతడు గుర్తించేలా చెయ్యడానికి. భయంకరాచారి తల యెత్తలేదు శేఖరం కుర్చీలో అతనికన్నా దర్జాగా కూర్చున్నాడు. గోపాలానికి విసుగుపుట్టింది ఆముదం గిన్నె పట్టుకొచ్చి నెత్తిన దిమ్మరిద్దామనుకున్నాడు కాని ఎర్రటి ఆకళ్ళు బుంగమీసాలు, పంగనామాలు, బొర్ర ముక్కూ చూస్తే భయం పుట్టుకొచ్చింది. కాసేపయాక .

"సార్ ! రేపు ఫిబ్రవరి నాలుగుకి అంతా నాశనమయిపోతుందంటున్నారు. నిజమేనంటారా !" ఏదో మాట్లాడాలని అన్నాడు చివరికి.

అచారి పేపరులోంచి తల తీయలేదు

"అన్ని గ్రహాలూ కలుస్తాయిట !" గోపాలం తిరిగి అన్నాడు

ఎచారి తల పైకెత్తాడు కళ్ళజోడు పైనుంచి తనకేసి తీక్షణంగా చూస్తున్న ఎర్రకళ్ళనిచూసి జడుసుకున్నాడు గోపాలం

"గ్రహాలు !" అనేశాడు గబుక్కున

"ఊ ! గ్రహాలు ?" ఆచారి యిప్పటికి మాట్లాడాడు చికాగ్గా.

"గ్రహాలు అయితే నేనింకేం అనలేదు" గోపాలం బెంబేలుపడిపొయ్యాడు

"నువ్వు జ్యోతిష్కుడివా ఏమిటి! నిన్న మా శేఖరంతో ఏమిటో మాట్లాడుతూంటే మిత్రుడి వేమో అనుకున్నాను ఊహూ ! గ్రహాలు గురించి ఏమిటంటున్నావు.

గోపాలానికి పుట్టెడు దుఃఖం ముంచుకొచ్చింది, ఈ సంభాషణ ధోరణిచూసి. ఏదో ఒకటి చెప్పాలని "గ్రహాలు కలుస్తాయిట !" అన్నాడు చివరికి

"కలిస్తే ?"

"ఏంలేదు ?"

"అసలు నువ్వేదో దాస్తున్నావు అదేమిటో తెలుసుకోందే నా కింక బుర్ర పని చెయ్యదు" ఆచారి పేపరు మడిచి అన్నాడు అతడికేసే తీవ్రంగా చూస్తూ.

గోపాలానికి చిర్రెత్తుకొచ్చింది "ఏంలేదు ఏదో గుర్తుకొచ్చి చెప్పానంతే మీరు మామూలుగా పేపరు చదువుకోండి" గబగబా అనేశాడు.

ఆచారి అతనివంక సానుభూతిగా చూసి పేదవి . విరిచి తిరిగి పేపర్లో నిమగ్నుడైపోయాడు

గంటలు గడిచిపోయాయి అయిదున్నర కావస్తోంది శేఖరం పత్తాలేదు

"శేఖరం ఎక్కడ !" భయంకరాచారి పులిలాగ గదిలో అటూ యిటూ పచార్లు చేస్తూ అడిగాడు

"నాకూ తెలియదు. నేనూ అతని కోసమే చూస్తున్నాను."

ఇంతలో మెట్లమీద బూటు చప్పుడు వినబడింది అది మామూలుగా శేఖరం వేసుకునే బూటు చప్పుడేగాని, యీసారి తమాషాగా ఏదో పాటకిలయవేస్తున్నట్టు ధ్వనిచేస్తోంది సన్నటియీల పాట రొదచేస్తూ ఆఫీసులంతా ప్రతి ధ్వనించ సాగింది గోపాలం గుండె వేగంగా కొట్టుకుంది శేఖరానికీ పెద్దపులి యిక్కడున్నట్టు తెలియదేమో?

శేఖరం సరదాగా పాటొహటి యీలవేస్తూ గదిలో అడుగుపెట్టాడు పెట్టిపెట్టగానే "హల్లో గోపాలం" అని వెర్రికేకలాంటి దొకటి వేశాడు వెంటనే మీదికురికి కౌగిలించుకున్నంత పనిచేసి "నీకు నేనెంత కృతజ్ఞుణ్ణిబావా ? ఆడదాన్నయితే అమాంతం ముద్దుపెట్టేసుకునుందును ! యివాళ నా జీవితచరిత్రలో సువర్ణాక్షరాల్తో లిఖించబడుతుంది ఎంత ఆనందం ! ఎంత హాయి ! ప్రపంచమంతా రంగులరాట్నంలా గిర్రున నా చుట్టూ తిరుగుతోంది ఆశలనే ఆకాశ పుష్పాలఆనంద సౌరభాలు మత్తెక్కిస్తున్నాయి నాకు. యింద్రధనుస్సు పట్టుకపైకెక్కి చుక్కల చెక్కిళ్ళు గిల్లి చంద్రబింబాన్ని చుంబిస్తాను మబ్బుల చెరసాలలో మెరుపు కటకటాలమధ్య పూలశృంఖలాల్ని నేనూ,

# బరువైన కథ

లతా ఒకరి కొకరు తగిలించుకుంటాం, ఆనందిస్తాం మగాడి జీవితం ఓ యెడారైతే అందులో అతడు కోరిన ఆడది ఓ ఒయాసిస్ లాంటిది . . ."

ఈ కవిత్వానికుక్కిరి బిక్కిరౌతున్నాడు గోపాలం మాట పెగలడం లేదు.

"ఏమిటోయ్ శేఖరం, యీ వెర్రివేషాలేమిటి! ఏమిటైంది!" ఆచారి గోలపెట్టాడు

"వెర్రివేషాలు నావికావు వెర్రి పంతులూ, నీవి! యిదేం , జంతుశాస్త్ర పరిశోధనాపత్రికనుకున్నావా ఆస్ట్రేలియా గొర్రెల గురించి రాయడానికి ! యీ చెత్తంతా పట్టుకొచ్చి నా మొహాన పడేస్తే యింతకాలం ఎలాగో వేసుకున్నాను ఇకపైన వేస్టుపేపరు తొట్టెలో వెయ్యడం కూడా దండగే. నిప్పంటించేస్తాను జాగ్రత్త"

---

వేగంగా పోయే కారును ఆపుచేసి ఒక పోలీసు ఆఫీసరు, కారు నడిపే ఆసామీతో "కారు నడుపుటకు లైసెన్సు ఉందా?" అని అడిగాడు. కారు నడిపేవాడు "లైసెన్సు ఉంది చూస్తారా?" అని అడిగాడు. దానికి పోలీసు ఆఫీసరు: అక్కర లేదు, లైసెన్సు దగ్గర లేకపోతేనే చూస్తాను అన్నాడు.

పి. రవీందర్ రెడ్డి (హనుమకొండ)

---

"నువ్వు వేసుకోకపోతే కొంప మునిగిపోయిందా! లక్షాతొంబై పత్రికలున్నాయి దేశంలో ఏమనుకున్నావో!"

"నిక్షేపంలా వేయించుకో ఇక్కడికిమాత్రం ఎప్పుడూ యీ చెత్త తీసుకురాకు ఇదుగో పట్టుకెళ్ళు ఇంకెప్పుడూ యీ గుమ్మం తొక్కకు"

భయంకరాచారి శేఖరం చేతులోది లాక్కుని గబగబా బయటికెళ్ళిపోయాడు గోపాలానికి మతిపోయింది తన కళ్ళేదటిది నమ్మలేకపోతున్నాడు

"ఏమిటిది శేఖరం !" ఏమిటిదంతా ?

"ఏమో ! కలా! వైష్ణవమాయా! కాదు, రాధమాయ రాధా గోపాలం మాయ! అంతా మిధ్య నన్నిప్పుడేం మాట్లాడించకు బావా ! నా గుండెల్లో ఆనందపు వరదలు కట్టలు తెంచుకున్నాయి ఏం జరిగిందో టూకీగా చెప్తాను విను. ఎల్లా, ఏమిటి వగైరా ప్రశ్నలడక్క అవన్నీ యింటికెళ్ళి మా చెల్లాయి నడుగు లతా నేనూ రేవు, కాదు యింకొప్పది రేపులు పోయాక అప్పుడు పెళ్ళి చేసుకోబోతున్నాం లత ఒప్పుకుంది బై ! బై !"

శేఖరం వెళ్ళిపోతూ మాట్లాడుతూ వెళ్ళిపోయాడు వెళ్ళిపోతూ మొదటి గది తలుపు బయట తాళం వేసుకున్నాడు గోపాలం గత్యంతరంలేక ఆలోచనా మూఢుడై ప్రక్కగది తలుపులోంచి బయటపడ ప్రయత్నించాడు

క్రాష్, వీసెడు ఆముదం గోపాలం నెత్తిన ఒలికింది మేడ మెట్లు అన్నీ మొగంమీద కారుతున్న ఆముదం ధారలమధ్యనుంచి చూసి గోపాలం క్రిందికి దిగేంతలో రాధలాంటి స్వరూపంక్రింద మెదిలింది నవ్వుతూ గోపాలం క్షణంలో నల్లి, ఈగ, దోమ అంతకన్న చిన్నదీ అయిపోయాడు

ఇంటికెళ్ళి శుభ్రంగా స్నానం చేయించాక, తన తలని తుడుస్తున్న రాధతో గోపాలం అడగలేక అడిగాడు అసలిదంతా ఎలా జరిగిందనీ

"మీరు వెళ్ళగానే శేఖరానికి ఫోన్‌చేసి యింటికి రమ్మని నాప్లాను చెప్పాను. క్షణంలో శేఖరం తల పగిలింది. దిమ్మతిరిగి ఎడిపోయాడు. స్పృహ తప్పింది ఆ బాధలో లతకోసం కలవరించసాగాడు ఈ లోపల లతని ఫోనుచేసి పిలిచి సంగతి విశదీకరించాను"

"లతవచ్చి యీ దొంగవేషాన్ని గ్రహించి నాలుగు తిట్టిపోలేదూ !"

"పాపం వెర్రిపిల్ల ! యింతకుముందే తన వంతు ప్రేమ తనూ ప్రేమించేసింది. హడావిడిగా యింట్లో అడుగుపెట్టింది. గుమ్మాని కెదురుగ్గా సావిట్లో తలకి కట్టు కట్టుకుని బాధగా "లతా ! లతా" అని మూలుగుతున్న శేఖరం కనబడ్డాడు జాలిగా ఏడ్చింది శేఖరం చేతిని తన చేతులమధ్య నలుపుతూ శేఖరం అదృష్టవంతుడు లెండి. లత నిజంగా అప్సరసే"

"అసలు శేఖరానికి దెబ్బ తగిల్తే అంత హుషారుగా ఎలా రాగలిగాడని ?"

"నిజంగా తగిల్తే మనకెందుకు ? వాళ్ళే కలుసుకుని పెళ్ళాడేస్తారు . శేఖరం గొప్ప నటకుడు లెండి!"

"అయితే దెబ్బ తగల్లేదన్నమాట! మరా అమాయకురాలు పాపం ఎలా నమ్మింది! ఏదో ఆధారం ఉండాలిగదా!"

"నిజమే ఏదో ఆధారముండాలి ఉంది కూడాను. మీరు నిన్న కొన్న పెద్ద రాచిప్పంతటి మొద్దు పింగాణి ఫ్లవర్‌వేస్ పొరబాటున స్టాండ్‌మించి కూలి, తొందరగా లోపలికి వస్తున్న యితని తల వెనక భాగంమీద బలంగా తగిలిందని చెప్పాను...... కొంచెం వాస్తవికంగా ఉండడానికి నిజంగానే దాన్ని పగలగొట్టాను ఏమనుకోరుగదూ!" అతని తలని తన రొమ్ముకి జేర్చుకుని వేళ్ళతో సున్నితంగా జుట్టులో రాస్తూ గోముగా అంది రాధ.

"మొత్తానికి ఆడవాళ్ళ సలహా వినందే బాగుపడిన వాడెవ్వడూలేడు!" అన్నాడు గోపాలం మత్తుగా ఆమెని ఒళ్ళోకిలాక్కుంటూ. కథ కంచికి. మనం మరో కథకి. ★